క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ నేడు

కొమ్మాది: ఎండాడలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరించనున్నామని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వార్డు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

వీల్‌చైర్ల పంపిణీ



వీల్‌చైర్ అందజేస్తున్న నవీన్ కుమార్ తదితరులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పీపీ – 1 కాలనీలో గ్రేస్ హ్యాపీనెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ చైర్మన్ పాతల నవీన్ కుమార్ దివ్యాంగులకు వీల్‌చైర్లు, వృద్ధులు, పేదలకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదలు, దివ్యాంగులకు చేయూత అందించినట్టు తెలిపారు. ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు ఉడికల శివప్రసాద్, పి.రత్నం, పి.లిఖితజోయ్ తదితరులు పాల్గొన్నారు.

సంతపేటలో అంధకారం



సంతపేట రెడ్డివీధిలో వెలగని వీధిలైటు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేట రెడ్డివీధిలోని 96 ఎ6 విద్యుత్ దీపం వారం రోజులుగా వెలగకపోవడంతో ఈ ప్రాంతంలో అంధకారం నెలకొంది. ఈ ప్రాంతంలో తరచూ ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్, బ్యాటరీలు, టైర్లు అపహరణకు గురవుతున్నాయి. అలాగే చీకటిలో వీధికుక్కలు దారిన పోయేవారిపై దాడులకు దిగుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ దీపాన్ని పునరుద్ధరించాలని మార్రెళ్ల మోక్షిత్ రామ్, స్థానికులు కోరుతున్నారు.

అన్నదానానికి భారీ విరాళం

తగరపువలస: భీమిలి మండలం తాటితూరులో శ్రీశాలివాహన యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీసరస్వతీ దేవి నవరాత్రుల సందర్భంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన కోనాడ రంగయ్య తన కుమారుడు సంజీవరావు జ్ఞాపకార్థం అన్నదానానికి రూ.లక్ష విరాళం అందించారు.

ముగిసిన జాతీయ జూనియర్ చౌక్‌బాల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీపీ బాగ్చీ

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలసలో మూడు రోజులుగా జరుగుతున్న 16వ జాతీయ జూనియర్ చౌక్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో విజేతగా ఢిల్లీ, రన్నర్స్‌గా మహారాష్ట్ర, తృతీయస్థానంలో అస్సాం జట్లు నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో విన్నర్స్‌గా పశ్చిమ బెంగాల్, రన్నర్స్‌గా మహారాష్ట్ర, తృతీయస్థానంలో అస్సాం జట్లు నిలిచాయి. వీరికి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి ఈ పోటీలలో పాల్గొన్న 32 జట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు పాల్గొన్నారు.

జైలులో రక్తదాన శిబిరం

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) రక్తనిధి ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. జైల్ పెరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన శిబిరంలో అధికారులు, సిబ్బంది 18 మంది రక్తం చేశారు. ఈ సందర్భంగా జైలు పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు, ఉప పర్యవేక్షణాధికారి ఎస్.సాయిప్రవీణ్ రక్తం అందించిన సిబ్బందిని అభినందించారు. ఇలాంటి శిబిరాల నిర్వహణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైలర్లు, సిబ్బంది, విమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టేళ్ల మార్కెట్ నేలచూపులు

- వ్యాపారులు, పెంపకందార్లకు తప్పని నిరాశ
- ఏటా 800 నుంచి వెయ్యి వరకూ పొట్టేళ్లు, మేకల విక్రయాలు
- ఈ ఏడాది ఇప్పటి వరకూ సగం కూడా సాగని వ్యాపారం
- జోరుగా సాగుతున్న నాటుకోళ్ల అమ్మకాలు



తగరపువలస సంతలో విక్రయానికి తీసుకొచ్చిన పొట్టేళ్లు



విక్రయానికి సిద్ధంగా కోళ్లు

తగరపువలస: దసరా ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఏటా తగరపువలస ప్రైవేట్ మార్కెట్‌లో పండగ ముందు ఆదివారం జరిగే సంతలో రూ.2 కోట్ల పైచిలుకు వ్యాపారం జరిగేది. సుమారు 800 నుంచి 1000 వరకు మేకలు, పొట్టేళ్ల క్రయవిక్రయాలు జరిగేవి. ఈ ఏడాది మాత్రం రైతులు, వ్యాపారులకు పొట్టేళ్ల వ్యాపారం నిరాశే మిగిల్చింది. ఈ నెల 21, 28న జరిగిన సంతల్లో సగం విక్రయాలు కూడా జరగలేదని వీరు వాపోయారు. వాస్తవానికి ఈ ఏడాది ఉత్తరాంధ్రలో జరిగిన ఏ సంతలోనూ పొట్టేళ్ల వ్యాపారం సజావుగా సాగలేదని తెలిపారు. గతంలో కొమ్ములు తిరిగిన మేకలు, పొట్టేళ్ల కొనుగోలు కోసం నగరానికి చెందిన స్టీల్‌ప్లాంట్, ఇంధన సంస్థలు, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డు, పోర్ట్, రైల్వే, నేవీ, ఎఫ్‌సీఐ ఉద్యోగులు, ముఠా, ఆటో, ఆర్టీసీ కార్మికులు వాహనాలతో వచ్చేవారు. తమ గౌరవానికి భంగం కలగకుండా ధరలతో సంబంధం లేకుండా కొమ్ములు తిరిగిన, బలిష్టమైన జీవాలను కొనుగోలు చేసి విజయదశమి రోజు ఆయుధపూజకు సిద్ధం చేసేవారు. స్టీల్ ప్లాంట్‌లో కార్మికుల తొలగింపుతో అలజడి, స్త్రీ శక్తి పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికుల నిరాశ, విజయదశమి రోజు గాంధీ జయంతి తదితర కారణాలతోనే పొట్టేళ్ల మార్కెట్ పడిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు. ఈ కారణాలు నాటుకోళ్లపై ప్రభావం చూపలేదని జరుగుతున్న విక్రయాలు చూస్తే అర్థమవుతుంది. మటన్ ధరల కంటే నాటు కోడి ధరలు ఆకాశంలోకి దూసుకుపోతున్నాయి. గుడ్డిలో మెల్ల నయం అన్నట్టు జీవాల కొనుగోలు జరగకపోయినా కిలో రూ.వెయ్యి వంతున మాంసం ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు ఉపశమనం పొందుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన బక్రీద్ పండగ సమయంలో వ్యాపారం కూడా ఆశించిన స్థాయిలో జరగలేదని నిర్వేదం చెందుతున్నారు. ఇక సోమవారం విజయనగరం జిల్లాలోని సవరవిల్లి సంతతోపాటు కందివలస గెడ్డ, బంగారాజు పేట, కొండరాజుపేట, కొత్తవలస, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస తదితర గ్రామాల్లో జరిగే విక్రయాలపైనే వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు.



విక్రయానికి సిద్ధంగా కొమ్ములు తిరిగిన మేకలు

ఏడాదంతా జీవాల పెంపకంపైనే ధ్యాస

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ వారం జరిగే సంతలకు ఉత్తరాంధ్ర వ్యాపారులు వాహనాలు వేసుకుని తరలి వెళ్తుంటారు. వీటిలో తగరపువలసతోపాటు కాశీపట్నం, కందివలస గెడ్డ, ఆముదాలవలస, రాజాం, నరసన్నపేట, హనుమంతవాక, కిలారి, సవరవిల్లి, గార, బాపట్ల, వినుకొండ, బొబ్బిలి, సాలూరు, బుడుమూరు, మానాపురం, పార్వతీపురం, ఖమ్మం, హైదరాబాద్ సంతలు ప్రముఖంగా ఉంటాయి. ఈ సంతలకు తీసుకొచ్చే జీవాలకు ప్రత్యేకంగా ఉలవలు, తెలగపిండి, గంజి అన్నం, తవుడు తదితర దాణా తినిపించి బలిష్టంగా తయారు చేస్తారు. మార్కెట్‌కు తరలించే ముందు నిగనిగలాడేందుకు స్నానం చేయిస్తుంటారు. వీటి కోసం నెలసరి వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెడుతుంటారు.

వ్యాపారం పరిధి తగ్గిపోయింది



గతంలో దసరా వస్తుందంటే మూడు నెలల ముందు నుంచే వ్యాపారం జరిగేది. కార్మికులు మేకలు, పొట్టేళ్లను కొనుగోలు చేసి మేపుకు ఇచ్చేవారు. వ్యవసాయ భూములు తగ్గిపోవడం, కుక్కల దాడులు, దొంగల భయం కారణంగా చివరి వరకు విక్రయాలు జరగడం లేదు. పైగా నాటు పొట్టేళ్లకు పోటీగా తక్కువ ధరలకు ఫారం, కొండ మేకలు, పొట్టేళ్లు లభిస్తున్నాయి.

– సాడి రామారావు, వ్యాపారి

మాంసం ఆర్డర్లు ఇస్తున్నారు



పొట్టేళ్ల మేపు ఖరీదైనది కావడంతో చాలా మంది మాంసం ఆర్డర్లు ఇస్తున్నారు. లైవ్‌లో కొనుగోలు చేసుకుంటే కిలో రూ.800 నుంచి లభిస్తుంది. ఇంకా తలకాయ, బోటీ మిగులుతాయి. ఆర్డర్ల ప్రకారం కిలో రూ.వెయ్యికి కొంటున్నారు. వ్యాపారులకు ఖర్చులు, అప్పులు భారంగా మారుతున్నాయి.

– వెంపాడ లక్ష్మణ, వ్యాపారి

నాటుకోళ్లకు భలే గిరాకీ



గతంలో ఆయుధపూజకు పొట్టేళ్లను వినియోగించేవారు. ఇప్పుడు నాటుకోళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో నాటుకోళ్ల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. గ్రామదేవతల పండగలు, ఫంక్షన్లకు అవసరమైన వారు ఖచ్చితంగా మేకలు, పొట్టేళ్లను కొంటున్నారు. దీంతో వ్యాపారం ఒక్కోసారి డల్‌గా మారోసారి ఫుల్‌గా సాగుతోంది.

– కొల్లి రాము, వ్యాపారి





సంతకు తరలించే ముందు మేకకు స్నానం

సామియ్యవలస రహదారి గోతులమయం





సామియ్యవలస నుంచి మునివానిపేట వరకు గోతులమయమైన రోడ్డు



తగరపువలస: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామియ్యవలస నుంచి మునివానిపేట వరకు సుమారు కిలోమీటరు మేర రహదారి ఛిద్రమైపోయింది. సంగివలస జాతీయ రహదారి నుంచి భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలను కలుపుతూ విజయనగరం – సింహాచలం రహదారికి అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలో రోడ్డు అధ్వానంగా తయారైంది. పలుచోట్ల ప్రపంచ పటంలో దేశాల మాదిరిగా చెరువులను తలపిస్తున్న గోతులను కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కాలంగా మరమ్మతులు చేస్తామని చెబుతూ ఊరిస్తోంది. ఈ మార్గంలో ఇటుక బట్టీలు ఎక్కువగా ఉన్నందున నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోజురోజుకూ రహదారి శిథిలమవుతూ వస్తుంది. ఇప్పటికైనా ఈ రహదారికి మరమ్మతులు నిర్వహించి ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురి కాకుండా చూడాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన తొలి విడత ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అప్పలరాజును సత్కరిస్తున్న అతిథులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అభ్యర్థులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా దసరా సెలవులలో ఇచ్చిన ప్రత్యేక శిక్షణ ఆదివారంతో పూర్తయింది. వీరికి తిరిగి అక్టోబర్ 5 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు సొసైటీ అధ్యక్షుడు గంటాన మోహనరావు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జీవీఎంసీ అంబేడ్కర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజును సత్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థుల శిక్షణకు అవసరమైన మెటీరియల్ అందించనున్నట్టు తెలిపారు. ఉదయం జరిగిన శిక్షణ కార్యక్రమంలో భీమిలి మండలం కొత్త మూలకుద్దు ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుంపల దాలయ్యబాబు, బయాలజీ అధ్యాపకుడు వైవీ రమణ, గణిత అధ్యాపకుడు బీజేవీ రమణ విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, వీఎస్ కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు, వివిధ సబ్జెక్టుల నిపుణులు శివ, మహేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆస్తికి రక్షణ ఎక్కడ?

విద్యుత్ స్తంభం విరగ్గొట్టిన వారిపై 15 రోజులు దాటినా చర్యలు లేవు



పూర్తిగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభం కింది భాగం



వుడా హరిత వద్ద విరిగిపోయిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభం

మధురవాడ: ప్రభుత్వ ఆస్తులంటే అధికారులకు ఏమాత్రం లెక్క ఉన్నట్టు ఉంది. ఇక జీవీఎంసీ ఆస్తి అంటే మరీ చులకన అనిపిస్తోంది. 15 రోజుల క్రితం జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ–తిమ్మాపురం మాస్టర్ ప్లాన్ రోడ్డులో వుడా హరిత వద్ద ఒక ప్రమాదంలో విద్యుత్ స్తంభం, ఒక చెట్టు పూర్తిగా ధ్వంసమయ్యాయి. స్తంభం ఖరీదు సుమారు రు. 50 వేలు కాగా ఇతర ఖర్చులు అదనం. సెప్టెంబర్ 13న కొందరు యువకులు మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు నడిపి ఒక ద్విచక్ర వాహన చోదకుడిని ఢీకొట్టారు. సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో కారు డివైడర్ పైకి ఎక్కి ఒక చెట్టును ఢీకొట్టినా అదుపు కాకుండా జీవీఎంసీ విద్యుత్ స్తంభాన్ని కూడా ఢీకొట్టి ఆగింది. చెట్టు, విద్యుత్ స్తంభం పూర్తిగా దెబ్బతిన్నాయి. కారులో ఉన్న యువతీ యువకుల్లో యువకులు మద్యం సేవించారని, ప్రమాదం జరిగిన తర్వాత ప్రమాదానికి గురైన కారులో నుంచి మద్యం సీసాలు, గ్లాసులు ఇతర సామగ్రి వేరే కారులోకి తరలించినట్టు స్థానికులు పోలీసులకు చెప్పారు. ప్రమాదానికి కారణం అయిన వారు ఆర్థిక, రాజకీయ పలుకుబడి ఉన్న వారు కావడంతో కేసు లేకుండా రాజీ చేసుకున్నట్టు సమాచారం. కాని ధ్వంసం అయిన విద్యుత్ స్తంభానికి సంబంధించి డబ్బులు కట్టించడం గాని, ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినందుకు కేసు పెట్టడం గానీ జరగలేదు. దీనిపై జీవీఎంసీ విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ గాయిత్రిని వివరణ కోరగా ప్రమాదం జరిగిన మరుసటి రోజే పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చామని, ఇంత వరకు కేసు నమోదు చేసినట్టు తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. కనీసం ఉన్నత స్థాయి అధికారులైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శ్రీమహా చండీదేవిగా అమ్మవారు



బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



చిప్పాడలో అన్నప్రసాదం వడ్డిస్తున్న మహిళలు



చిప్పాడలో శాకంబరీదేవి అలంకరణలో అమ్మవారు

తగరపువలస: శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారిని మహా చండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా భీమిలి మండలం చిప్పాడలో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. పలు భవానీ పీఠాలలో సాయంత్రం అమ్మవారిని కలశాలు, జ్యోతులతో ఊరేగించారు. అలాగే చిప్పాడలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. చిట్టివలస బంతాట మైదానంలోని మండపం వద్ద ఎర్నింటి బ్రదర్స్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వ్యాపారస్తుడు రంగూరి సీతారామదొర ప్రారంభించగా మణికంఠ స్వీట్స్ అధినేతలు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు. ఆనందపురం మండలం చందక పంచాయతీలోని మంచుతో తయారు చేసిన శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక్కడ 4 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

రజత కవచాలంకృతగా దుర్గాదేవి దర్శనం



దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



మహా దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గా మాత

మధురవాడ: దసరా ఉత్సవాల సందర్భంగా చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో కొలువైన దుర్గమ్మ భక్తులకు వెండి కవచంతో దర్శనం ఇచ్చారు. ఆదివారం ఉదయం నుంచే అమ్మకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. చంద్రంపాలెంతో పాటు ఎన్‌జీజీవోస్ కాలనీ, మధురవాడ, దుర్గానగర్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరయ్యారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత జగదేశ్వరరావుకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరంలోని మధురవాడకు చెందిన ఎం.జగదేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

గుండె ఆరోగ్యంపై ర్యాలీ

మహారాణిపేట : ఎంజీఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అవగాహన, ప్రచారం కోసం ఈ ర్యాలీ, వాక్‌థాన్ జరిగింది. ఆదివారం ఉదయం 5:30 గంటలకు ఆర్కే బీచ్‌లో కాళీమాత ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమై వైఎంసీఏ వరకు సాగింది. ఈ ర్యాలీని పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.దామోదర్‌రావు, డాక్టర్ ఎం.భాస్కర్ రావు, డాక్టర్ ఎం.ఎన్.రాజు, డాక్టర్ శిరీష, డాక్టర్ ఎల్.హరిత కుమారి, డాక్టర్ గిరిబాబు నాదెళ్ల, డాక్టర్ రాఘవేంద్ర కుమార్ గుడ్ల పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకపోతే న్యాయ పోరాటం

టీడీపీ నేత నాగోతి సూర్యప్రకాశరావు



తన షాపుల వద్ద నాగోతి సూర్యప్రకాశరావు

మధురవాడ: తన తండ్రి నాగోతి సింగన్న నుంచి సంక్రమించిన భూమికి పరిహారం ఇవ్వకుండా తన భూమిలోకి జీవీఎంసీ, ఇతర అధికారులు వచ్చి ఇబ్బందులు సృష్టిస్తే న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ నాయకుడు, ఏపీ నగరాలు కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు తెలిపారు. ఆదివారం మధురవాడ హైవే-నగరంపాలెం వద్ద ఉన్న దుకాణాల వద్ద మీడియాతో మాట్లాడారు. తమకు మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 51/1లో గల కొంత భూమి ఇతరులకు విక్రయించగా, మరికొంత జాతీయ రహదారి విస్తరణలో హైవే అధికారులు తీసుకున్నారని, కొంత స్థలం మిగిలిందని చెప్పారు. అందులో దుకాణాలు కూడా ఉన్నాయన్నారు. కొన్నేళ్లుగా పరిహారం ఇవ్వకుండా, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా షాపులు తొలగిస్తామని వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని, కోర్టును కూడా ఆశ్రయిస్తామని చెప్పారు.

తీరం.. జనసంద్రం



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

కొమ్మాది: పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు పర్యాటకుల తాకిడి కనిపించింది. గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ బీచ్‌లు, రామానాయుడు స్టూడియో, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి సాగరతీరంలో పర్యాటకుల సందడి నెలకొంది. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా గడిపారు.